మలుపులతో ప్రమాదాలు

- ఇరుకు రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు
- సైడ్‌బర్మ్ లేక వాహనదారుల ఇక్కట్లు
- పొగమంచుతో పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికారులు



ఖానాపూర్–పెంబి మార్గంలో సైడ్ బర్మ్ లేక ప్రమాదకరంగా రోడ్డు



ఖానాపూర్ నుంచి రాజూరా వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా మలుపు

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇరుకురోడ్లు కావడం.. ఆపై ఇరువైపులా చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి ఉండటంతో ఎప్పుడు ఏయే ప్రమాదం జరుగుతుందో తెలియక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్లపై మలుపులు కన్పించక జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా.. మరికొందరు క్షతగాత్రులు ఆసుపత్రుల్లో చేరి ప్రాణాలను కాపాడుకున్నారు.

మండలంలో..

ఖానాపూర్ నుంచి పెంబి వరకు 20 కిలోమీటర్ల మొరంరోడ్డుతోపాటు ఖానాపూర్ నుంచి బెల్లాల్ రోడ్డు(21కిలోమీటర్లు), ఖానాపూర్ నుంచి రాజూరా వరకు 18 కిలోమీటర్లు, ఖానాపూర్ నుంచి ఎర్వచింతల్ 15 కిలోమీటర్లు, ఖానాపూర్ నుంచి సదర్మాట్ 8 కిలోమీటర్లతోపాటు ఇతర మార్గాలు ఉన్నాయి. ఆయా రోడ్లు ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖల పరిధిలో ఉన్నాయి. వీటి పరిధిలో మలుపులు, రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

మూడు కిలోమీటర్లు.. 30 మలుపులు

ఖానాపూర్ పట్టణం నుంచి కడెం మండలం బెల్లాల్ వరకు ఉన్న 21 కిలోమీటర్ల రోడ్డు మలుపులు, ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఈ రోడ్డుపై సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో 30 వరకు మలుపులున్నాయి. ఖానాపూర్ టూ రాజూరా, ఖానా పూర్ టూ పెంబి వెళ్లే మార్గాల్లోనూ మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో వాహనదారులు పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ నుంచి సదర్‌మాట్ వెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గోసంపల్లె నుంచి గోడలపంపు, కొత్తపేట్ నుంచి బావాపూర్(కే), గోసంపల్లె నుంచి పాతఎల్లాపూర్, రాజూరా నుంచి చందునాయక్‌తండా వెళ్లే మార్గాల్లోనూ మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

భయాందోళనలో ప్రజలు

ప్రధాన రహదారుల పక్కన వ్యవసాయ పొలాలు, గ్రామాలు ఉండడంతో రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు వాహనాల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. అసలే ఇరుకైన రోడ్లు, చుట్టూ చెట్లు, ప్రమాదకర మలుపులున్నాయి.

రోడ్డు విస్తరణ పనులు చేయాలి..

అధికారులు తక్షణమే రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లకొమ్మలు తొలగించి విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మలుపుల వద్ద వాహనదారులకు కనిపించేలా సూచిక బోర్డులు లేక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పొగమంచుతో ఎదురు వస్తున్న వాహనాలు కనిపించడం లేదు.

ఇరుకురోడ్డు.. కానరాని సైడ్‌బర్మ్

ప్రధాన రహదారులకు వేసిన సైడ్ బర్మ్(మట్టి) భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు ఎక్కేందుకు, దిగేందుకు వీల్లేక వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇరుకు రోడ్డు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఖానాపూర్ మండలం నుంచి వెళ్లే ప్రధాన రహదారులైన ఖానాపూర్–పెంబి, ఖానాపూర్–బెల్లాల్, ఖానాపూర్–రాజూరా మార్గాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులతోపాటు సైడ్‌బర్మ్, పలుచోట్ల చెట్లకొమ్మల తొలగింపు, మలుపుల వద్ద ప్రమాద సూచికల ఏర్పాటుకు రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవగానే పనులు చేపడుతాం.

– విజయలక్ష్మి, ఏఈఈ, ఆర్అండ్‌బీ, ఖానాపూర్

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

సారంగపూర్: దేశ అభివృద్ధే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ నాయకులు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుప్యాతండా గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సంకల్ప్‌యాత్రపై ప్రధాని మాట్లాడిన వీడియోను గ్రామస్తులతో కలిసి వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలు మారుమూల గ్రామాలకు చేరువ కావాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంజుకుమార్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, రావులరాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, రాంశంకర్‌రెడ్డి, విలాస్, గంగారెడ్డి, ప్రకాశ్, రవి తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని ఇలేగాం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొనిమాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, మిర్జాపూర్ ఎంపీటీసీ రజాక్, పండిత్‌పటేల్, బీజేపీ నాయకులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్, కొత్తపేట్ గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్ఈడీ తెరపై వీడియోలు ప్రదర్శించి గ్రామస్తులకు కేంద్ర పథకాల క్యాలెండర్లు పంపిణీ చేశారు. అనంతరం పెంబి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించి, గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అధికారులు సోమశేఖర్, లోకిని జూని, స్వాతి, సుజాత, లక్ష్మి, నాయకులు నర్సయ్య, సాయికిరణ్, కిషన్ పాల్గొన్నారు.



ఖానాపూర్: దిలావార్‌పూర్‌లో వైద్యశిబిరం

‘ప్రజాపాలన’ గ్రామసభలు

లోకేశ్వరం: మండలంలో ఈనెల 28 నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమ గ్రామసభలను నిర్వహిస్తున్నామని.. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 28న భాగాపూర్, కిష్టాపూర్, కన్కపూర్, అబ్దుల్లాపూర్, 29న అర్లిగొడిసెర, పోట్‌పల్లి(బి), గడ్‌చాంద, 30న హవర్గ, పిప్రి, జోహర్‌పూర్, వట్టోలి, జనవరి 2న నగర్, సాథ్‌గాం, లోకేశ్వరం, 3న సేవాలాల్‌తండా, రాయపూర్‌కాండ్లీ, బిలోలి, బామ్ని(కే), 4న హథ్‌గాం, పంచగుడి, ధర్మోర, 5న మన్మద్, నర్సింహనగర్‌తండా, 6న రాజూర, పుస్పూర్ గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 28న మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న లక్ష్మణచాంద, న్యూకంజర్, చింతల్‌చాంద, మునిపెల్లి గ్రామాల్లో ఈనెల 30న చామన్‌పెల్లి, ధర్మారం, పార్‌పెల్లి, పీచర, గ్రామాల్లో, వచ్చే నెల 2న బోరిగాం, వడ్యాల్, కనకాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో, 3న నర్సాపూర్, తిర్పెల్లి, వడ్యాల్‌తండాలో.. జనవరి 4న బాబాపూర్, రాచాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం ఉంటుందని..ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

మామడ మండలంలో..

మామడ: మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రజాపాలన వేదికల్లో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న లింగాపూర్, 29న అనంతపేట్, నల్దుర్తి, వెంకటాపూర్, బండలఖానాపూర్, న్యూసాంగ్వి గ్రామాల్లో, 30న దిమ్మదుర్తి, కప్పన్‌పల్లి, మామడ, రాయదారి గ్రామాల్లో జనవరి 2న కొరిటికల్, న్యూలింగంపల్లి, పొన్కల్, పరిమండల్ గ్రామాల్లో, 3న జగదాంబతండా, కిషన్‌రావ్‌పేట్, చెరువుముందుతండా, బూరుగుపల్లి గ్రామాల్లో, 4న రాసిమెట్ల, బుర్దపల్లి, ఆరేపల్లి, తోటిగూడ గ్రామాల్లో, 5న వస్తాపూర్, రాంపూర్, మొండిగుట్ట, సోన్‌పేట్, తండ్రా ఈనెల 6న పోతారం, కమల్‌కోట్, జమ్లానాయక్‌తండా, ఆదర్శనగర్ గ్రామాల్లో ప్రజాపాలన వేదికలు నిర్వహిస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు.

బడీడు పిల్లల గుర్తింపు సర్వే

భైంసారూరల్: మండలంలోని మాటేగాం, ఎగ్గాం గ్రామాల్లో బుధవారం సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, బడీడు పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. మాటేగాంలో తొమ్మిది మంది విద్యార్థులు, ఎగ్గాంలో ఇద్దరు దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించినట్లు ఎంఈవో సుభాష్ తెలిపారు. ఇంటింటా తిరుగుతూ దివ్యాంగుల వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం సర్వే ఆధారంగా దివ్యాంగులైన వి ద్యార్థులకు ఉపకరణాలు అందిస్తుందని ఎంఈవో పేర్కొన్నారు. ఐఈఆర్‌టీలు నరేశ్, సునీల్ తదితరులు ఉన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

కుంటాల: మండలంలోని అంబకంటితండాలో బుధవారం ప్రజాపాలన వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామసభల్లో ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు. ప్రత్యేకాధికారి మసార్‌రావు, తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్ ఖాన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి,ఎంపీవో రహీం, సర్పంచ్ జాదవ్ శంకర్,ఏపీవో నవీన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్మల్ మున్సిపాలిటీలో..

నిర్మల్‌టౌన్: పట్టణంలో వార్డుల వారీగా ప్రజాపాలన వేదికలను ఏర్పాటు చేసి గురువారం నుంచి జనవరి ఆరో తేదీ వరకు ఆరు గ్యారంటీలకు దరఖాస్తు స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు తెలిపారు. ఒక్కో సెంటర్లో ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశామని.. రోజుకు 5 కాలనీల్లో ప్రజావేదికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఈనెల 28న..

ఒకటో వార్డు ప్రజలు బాపూజీ సంఘం గాంధీనగర్‌లో, 2వ వార్డు ప్రజలు నాయుడువాడ హనుమాన్ ఆలయంలో, 3వ వార్డు ప్రజలు రామ్‌రావు బాగ్ మున్నూరు కాపు సంఘంలో, 4వ వార్డులో బంగల్‌పేట్ ముదిరాజ్ సంఘంలో, 5వ వార్డులో బంగల్‌పేట్ గంగపుత్ర సంఘంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈనెల 29న..

6వ వార్డులో వెంకటాద్రిపేట్ మున్నూరు కాపు సంఘంలో, 7వ వార్డులో మౌలయి, షేక్‌సాహెబ్ పేట్‌లో, 8వ వార్డులో కురన్నపేట్ అంబేద్కర్ భవన్‌లో, 9వ వార్డులో బాగులవాడ అంజనేయ యువజన సంఘంలో, 10వ వార్డులో గొల్లపేట్ బీసీ సంఘంలో దరఖాస్తు చేసుకోవాలి.

ఈనెల 30న..

11వ వార్డులో వెంకటాపూర్ గ్రామపంచాయతీలో, 12వ వార్డులో శాంతినగర్ వడ్డెర సంఘంలో, 13వ వార్డులో రవి హైస్కూల్‌లో, 14వ వార్డులో సోఫినగర్ కమ్యూనిటీ హాల్‌లో, 15వ వార్డులో ఈద్గాం పడిగెల భూమన్న ఫంక్షన్‌హాల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

జనవరి 2న..

16వ వార్డులో రాంనగర్ హాస్పిటల్‌లో, 17వ వార్డులో గాయత్రిపురం మస్తానియా మసీద్‌లో, 18వ వార్డులో మంజులాపూర్ పంచాయతీ ఆఫీస్‌లో, 19వ వార్డులో మంజులాపూర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో, 20వ వార్డులో ఐడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

జనవరి 3న..

21వవార్డు ప్రజలు బాజీ భవన్‌లో, 22వ వార్డులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, 23వ వార్డులో కబూతర్ కమాన్ కమ్యూనిటీ హాల్‌లో, 24వ వార్డులో సోమవార్‌పేట్ గర్ల్స్ హైస్కూల్‌లో, 25వ వార్డులో ధర్మశాలలో దరఖాస్తు చేసుకోవాలి.

జనవరి 4న..

26వ వార్డులో రథాల టెంపుల్ బ్రాహ్మణ సంఘంలో, 27వ వార్డులో దేవరకోట టెంపుల్ షాపులలో, 28వ వార్డులో ధ్యాగవాడ మున్నూరు కాపు సంఘంలో, 29వ వార్డులో కస్బా స్కూల్ గ్రౌండ్‌లో, 30వ వార్డులో బాగులవాడ ఆంజనేయ యువజన సంఘంలో దరఖాస్తు చేసుకోవాలి.

జనవరి 5న..

31వ వార్డులో బోయవాడ బస్ డిపో గంగపుత్ర సంఘంలో, 32, 33వ వార్డుల ప్రజలు మున్సిపల్ ఆఫీస్ పక్కన అంబేద్కర్ భవన్‌లో, 34వ వార్డులో ప్రియదర్శినినగర్ లయన్స్ క్లబ్‌లో, 35వ వార్డులో బాల్జి భవన్‌లో, 36వ వార్డు ప్రజలు బుధవార్‌పేట్ మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

జనవరి 6న..

37వ వార్డులో బుధవార్‌పేట్ మోచి సంఘంలో, 38 వార్డులో బుధవార్‌పేట్ గుండయ్య హాస్పిటల్‌లో, 39వ వార్డులో దేవరకోట టెంపుల్ షాపులలో, 40వ వార్డులో చింతకుంటవాడ మున్నూరు కాపు సంఘంలో, 41వ వార్డులో మున్సిపల్ కార్యాలయం పక్కన అంబేద్కర్ భవన్‌లో, 42వ వార్డులో ప్రజలు చింతకుంట వాడ మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సోన్: రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా బుధవారం జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రమేశ్, స్వప్న విద్యార్థులను పరీక్షించారు. ఎత్తు, బరువు వివరాలు నమోదు చేసుకున్నారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఫార్మసిస్ట్ సుచరిత, ఏఎన్ఎం అనిత, ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

భైంసా: బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు మండలంలోని ఖథ్‌గాం సర్పంచ్ రాజు, భైంసా వైస్ ఎంపీపీ గంగాధర్ ప్రకటించారు. బుధవారం భైంసాలో పలువురు సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీతో భేటీ అయ్యారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తమతో మాట్లాడలేదని వాపోయారు. తీవ్ర మనస్తాపంతో పార్టీని వీడుతున్నామని.. ఫ్యాక్స్ ద్వారా రాజీనామా పంపిస్తామని వెల్లడించారు. వాలేగాం, టాక్లీ, పేండ్‌పెల్లి, కోతల్‌గాం, వానల్‌పాడ్, కుంబి గ్రామాల సర్పంచ్‌లు సైతం త్వరలో రాజీనామా చేస్తారని పేర్కొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి

కుంటాల: స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ స్వాతి పేర్కొన్నారు. బుధవారం కుంటాలలోని శ్రీ సరస్వతి మండల సమైక్య భవనంలో సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ, విద్య, వ్యా పా ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం అశోక్ అన్నారు. మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి, సీసీలు పెంటన్న, కవిత, యూసుఫ్ పాల్గొన్నారు.

వక్ఫ్ స్థలంపై వివాదం

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి) బైపాస్‌రోడ్డులో ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలం (సర్వే నం.162) విషయమై స్వల్ప వివాదం చోటు చేసుకుంది. సదరు స్థలంలో భైంసా పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సాగు పనులు చేస్తుండగా బుధవారం సయ్యద్ అహ్మద్ రైజా(ముత్తావలి) అక్కడికి చేరుకుని సదరు భూమి వక్ఫ్‌బోర్డుకు అప్పగించాలని సుప్రీంకోర్టు ఆర్డరు కాపీ ఇచ్చినట్లు తెలిపి భూమి స్వాధీనానికి యత్నించారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. కోర్టు తీర్పు ప్రకారం స్థలం అప్పగించాలని కోరగా ప్రత్యర్థివర్గం వారు తనతో వాగ్వాదానికి దిగినట్లు సయ్యద్ అహ్మద్ రైజా తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

సరుకులు పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఎంజాల్ నరేశ్ అనే పేద కుటుంబానికి చెందిన యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబానికి మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ వొడ్డెపల్లి కృష్ణంరాజు తన వంతుగా రూ.నాలుగు వేల విలువైన నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ఓకేఆర్ మిత్ర బృందం పాల్గొన్నారు.

చిరువ్యాపారి విరాళం

సోన్: మండలంలోని సిద్దులకుంటకు చెందిన కూరగాయల వ్యాపారి రఘుపతి దంపతులు బుధవారం కడ్తాల్ అయ్యప్ప ఆలయ అభివృద్ధికి రూ.ఐదు వేలను అందించారు. తాము మొక్కుకున్నట్లు నిర్మల్ ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి గెలిచినందుకు గురుస్వామి నర్సారెడ్డికి విరాళం అందించినట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీకి సన్మానం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామస్తులు బుధవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన మామిడి నారాయణ్‌రెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్ పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సాయారెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీని సన్మానించారు. భాస్కర్, సాయన్న, ప్రకాశ్, రమేశ్ గౌడ్, శ్రీనివాస్‌రావు, మోహన్ పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ పాలనలోనే గౌరవం’

ఖానాపూర్: కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఉద్యమకారులకు అరుదైన గౌరవం దక్కిందని తెలంగాణ ఉద్యమకారుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదార్ల గంగనర్సయ్య అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం కోసం దరఖాస్తులు స్వీకరించడం హర్షణీయమని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన సర్పంచులు

కడెం: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను మండలంలోని సర్పంచులు బుధవారం ఆదిలాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పెండింగ్ బిల్లులను విడుదలతోపాటు సర్పంచుల పదవీకాలం ఏడాది పొడిగించాలని కోరినట్లు కడెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గొల్ల వేణుగోపాల్ తెలిపారు.

నేరాలు నియంత్రించేందుకే తనిఖీలు

- ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి

లోకేశ్వరం: నేరాలను నియంత్రించేందుకే నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తున్నామని ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సెర్చ్ (కమ్యూనిటీ కాంటాక్ట్) నిర్వహించారు. ఈసందర్భంగా రైస్‌మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అన్ని వాహనపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతకుముందు పత్రాలు సరిగా లేని 87 బైక్‌లు, రెండు ఆటోలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. వాటికి జరిమానా విధించి యజమానులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, బాసర, తానూరు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కన్కపూర్‌లో మాట్లాడుతున్న సీఐ వినోద్‌రెడ్డి

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కడెం: న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కొసన రాజు పేర్కొన్నారు. బుధవారం కడెంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31న మద్యం సేవించి రోడ్లపై తిరగవద్దన్నారు. అజాగ్రత్తగా వాహనాలు నడపడం, కేక్‌లు కట్ చేయడం, డీజే సౌండ్‌లు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

పెంబి: న్యూఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పెంబి ఎస్సై రజినీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31న రాత్రి యువత మద్యం సేవించి రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, అతి వేగంతో బైక్‌లు నడపడం వంటివి చేయవద్దని పేర్కొన్నారు. డీజేలకు అనుమతులు లేదని.. ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన దత్త జయంతి ఉత్సవాలు

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో దత్తాత్రేయస్వామి ఆలయంలో రెండు రోజులుగా కొనసాగుతున్న దత్త జయంతి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. జాతరకు మండలంతోపాటు మహారాష్ట్రలోని భోకర్, ఉమ్రి, నాందా, రాశీ తదితర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. సర్పంచ్ సాయినాథ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



బెల్‌తరోడాలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో వచ్చే నెల 3 నుంచి 5 వరకు శ్రీ వీరాంజనేయ, పెద్దమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఓలా గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను తన నివాసంలో కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కంబొలి చిన్నన్న, వీడీసీ చైర్మన్ నాలం మహేందర్, నర్సింలు, శరత్‌గౌడ్, సాయన్న, లింగం తదితరులు ఉన్నారు.

సజావుగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టాలి

భైంసాటౌన్: పట్టణంలోని వార్డుల్లో నిర్వహించే ప్రజాపాలన వేదికల్లో ఆరు గ్యారంటీలు అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సజావుగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో వార్డు అధికారులు, సిబ్బందికి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతివార్డులో దరఖాస్తుల స్వీకరణకు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని సూచించారు.హెచ్ఈవో కలీమొద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

‘కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి’

భైంసాటౌన్: నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ముధోల్ మండలం ఆష్ట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సరుగుల పోశెట్టి, రావుల శ్రీనివాస్, సాయిరెడ్డి, బాలయ్యగారి ముత్యం తదితరులకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమస్య వస్తే తనను సంప్రదించాలని.. ఎల్లవేళలా అండగా ఉంటానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సిందే ఆనంద్‌రావ్ పటేల్, శంకర్ చంద్రే, ప్రేంనాథ్ రెడ్డి, ముత్యంరెడ్డి, గంగారెడ్డి, ఆత్మ స్వరూప్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో గురుస్వామి మచ్చ రజినీకాంత్, కుంటాలలో కొత్తకాపు మహేశ్ స్వామి ఇళ్లలో బుధవారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. గురుస్వాములు జక్కని గజేందర్, రాజేశ్వర్, హరిప్రసాద్, ఉదయ్ కుమార్, నటరాజ్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలో బుధవారం వైభవంగా మండలపూజ మహోత్సవం నిర్వహించారు. శబరిమల ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ హరిహరన్ నంబూద్రి హాజరై పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు ప్రారంభించారు. ఉదయం ఏడు గంటల నుంచి హోమాలు చేయగా.. గురుస్వామి మూర్తి, పాకాల రాంచందర్, సామల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



హోమం వద్ద శబరిమల అర్చకులు, స్వాములు

‘ఆందోళన వద్దు’

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తుల కోసం పట్టణప్రజలు ఆందోళన చెందవద్దని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్ సూచించారు. గురువారం నుంచి వార్డుల వారీగా ప్రజాపాలన వేదికల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఇందుకోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దన్నారు. దరఖాస్తు పత్రాలను మున్సిపల్ తరఫున కౌన్సిలర్లు, ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి అందిస్తారని తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు మినహా ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేదని పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో సౌకర్యాలు కరువు

పెంబి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల్లేవని.. పేదలకు వైద్యసేవలు అందడం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్ అన్నారు. బుధవారం పీహెచ్‌సీని సందర్శించి మాట్లాడారు. ఆసుపత్రికి రెగ్యులర్ డాక్టర్ లేరని.. అప్పుడప్పుడూ ఇన్‌చార్జి డాక్టర్ వచ్చి వెళ్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాలకు చెందిన రోగులు ఇబ్బంది పడుతున్నారని..సమస్య పరిష్కరించి గిరిజనులకు వైద్యం అందించాలని కోరారు.

తనిఖీ

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె, గోడలపంపు ప్రభుత్వ పాఠశాలలను బుధవారం పాతఎల్లాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం మల్లయ్య, సీఆర్పీ వనిత సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకొని బోధనను పరిశీలించారు.